# నమస్తే ఉదయం

తెలుగు దినపత్రిక

రంగారెడ్డి | సంపుటి : 01 | సంచిక: 348 | పేజీలు: 4 | వెల: 4/- | బుధవారం ● 03, జూలై 2024 | ఎడిటర్: ఎం.వనితా రెడ్డి




## ఆర్టీసీలో ఖాళీ పోస్టుల భర్తీ

**3035 పోస్టుల భర్తీకి ప్రభుత్వం అనుమతి**

హైదరాబాద్,జూలై2(నమస్తే ఉదయం): తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థలో ఖాళీగా ఉన్న 3035 పోస్టులను భర్తీ చేసేందుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. ఆర్టీసీ ఉన్నతాధి కారులు ప్రతిపాదనలు పంపిన మిగతా.. 2లో

# వినూత్నంగా ఆలోచించండి

- ప్రజలకు జవాబుదారీగా ఉండాలి
- అన్ని శాఖల ఉన్నతాధికారులకు ఆదేశాలు
- తెలంగాణను ఆదర్శంగా తీర్చిదిద్దాలి
- వారానికో రోజు జిల్లాల పర్యటన
- నెలకోసారి జిల్లా అధికారులతో సమీక్ష
- ఐఏఎస్ అధికారులకు సీఎం రేవంత్ రెడ్డి దిశానిర్దేశం



హైదరాబాద్,జూలై2(నమస్తే ఉదయం): ప్రభుత్వ ప్రాధాన్యతలకు అనుగుణంగా పని చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్రంలోని అన్ని విభాగాల ఉన్నతాధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఐఏఎస్ అధికారులందరూ విధిగా తమ పరిధిలోని శాఖలు, విభాగాలపై పట్టు సాధించాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ప్రజలకు జవాబుదారీగా ఉండే ప్రజా పాలనను అందించేందుకు అందరూ బాధ్యతగా పని చేయాలని దిశా నిర్దేశర చేశారు. అందరూ కలిసికట్టుగా పని చేసి ప్రజలకు సుపరిపాలనను అందించి తీరాలని చెప్పారు. దేశంలోనే అన్ని రాష్ట్రాలకు ఆదర్శంగా ఉండేలా తెలంగాణను తీర్చిదిద్దాల్సిన బాధ్యత అధికారులపైనే ఉందని అన్నారు. తమ శాఖల పని తీరును మెరుగుపరిచేందుకు అవసరమైన ప్రక్షాళన చేసుకోవాలని సీఎం సూచించారు. రాష్ట్ర ప్రజలకు ఉపయోగపడే కొత్త కార్యక్రమాలు, వినూత్న ఆలోచనలతో ముందుకు సాగాలని సూచించారు. ఒక్కో అధికారి ఒక్కో ఫ్లాగ్ షిప్ ఐడియాను రెండు వారాల్లో ప్రభుత్వానికి సమర్పించాలని ఆదేశించారు. ఉమ్మడి రాష్ట్రం నుంచి ఇప్పటివరకు పలువురు ముఖ్యమంత్రులతో పని చేసిన అనుభవమున్న అధికారులు ఇప్పటికీ కీలక విభాగాల్లో ఉన్నారని, ఎప్పటి కప్పుడు ఆ ప్రభుత్వ ప్రాధాన్యాతలను గుర్తించి అధికారులు తమ పనితీరును చాటుకోవాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ప్రజలకు మేలు జరిగే పనులు చేయాలనే సంకల్పంతో విధులు నిర్వహించాలని, ప్రజల సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధి లక్ష్యంగా పని చేయాలని కోరారు. సచివాలయంలో మంగళవారం అన్ని విభాగాల కార్యదర్శులతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమావేమయ్యారు. మంత్రులు కోమటిరెడ్డి వెంకట్రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, సీఎంవో ముఖ్య కార్యదర్శి శేషాద్రి ఈ సమీక్షలో పాల్గొన్నారు. మొత్తం 29 విభాగాలకు చెందిన ఐఏఎస్ అధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. అధికారులందరూ ఏకతాటిపై పని చేస్తేనే ప్రభుత్వానికి మంచి పేరు వస్తుందని అన్నారు. సచివాలయం నుంచి క్షేత్రస్థాయి వరకు అందరూ తమ విభాగాలపై పట్టు సాధించాలని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తొలి వంద రోజుల్లోనే ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం ఆరు గ్యారంటీల్లో అయిదు గ్యారంటీలను అమలు చేసిందని సీఎం చెప్పారు. తర్వాత వంద రోజులు ఎన్నికల కోడ్ కారణంగా ప్రభుత్వ కార్యక్రమాలు, పనులు నిలిచిపోయాయని, ఇకపై అధికారులు విధిగా పరిపాలనపైనే దృష్టి సారించాలని ఆదేశించారు. దేశంలోనే అన్ని రాష్ట్రాలకు ఆదర్శంగా ఉండేలా తెలంగాణను తీర్చిదిద్దాల్సిన బాధ్యత అధికారులపైనే ఉందని అన్నారు. తమ శాఖల పని తీరును మెరుగుపరిచేందుకు అవసరమైతే అధికారులు, సిబ్బంది ప్రక్షాళన చేసుకోవాలని సీఎం సూచించారు. రాష్ట్రంలో ప్రజలకు ఉపయోగపడే కొత్త కార్యక్రమాలు, వినూత్న ఆలోచనలను ఎప్పటికప్పుడు నేరుగా సీఎంవోతో పంచుకోవాలని సూచించారు. ఒక్కో అధికారి ఒక్కో ఎ÷లాగ్ షిప్ ఐడియాను రెండు వారాల్లో ప్రభుత్వానికి సమర్పి ంచాలని ఆదేశించారు. ప్రజలకు సుపరిపాలనను అందించేందుకు అధికారులు క్రమశిక్షణ పాటించాలని, ప్రభుత్వ ప్రాధాన్యతలను గుర్తించి ప్రజా ప్రయోజనాలకు

మిగతా.. 2లో

## సైనికుల్లా పనిచేయండి

- గంజాయి, డ్రగ్స్ రాకుండా యుద్ధం చేయండి
- డ్రగ్స్, సైబర్ నేరాలు అరికట్టేందుకు సమర్థంగా పనిచేయాలి
- కొత్త చట్టాలపై పూర్తి అవగాహన పెంచుకోవాలి
- పోలీస్ కుటుంబాల కోసం సైనిక్ స్కూల్ తరహాలో స్కూల్
- తెలంగాణ బ్రాండ్ ఇమేజ్ కాపాడేందుకు కృషి
- పోలీస్ అధికారుల సమావేశంలో సీఎం రేవంత్ సూచన





హైదరాబాద్,జూలై2(నమస్తే ఉదయం): ఒకప్పుడు గుడుంబా పెద్ద సమస్యని, ఇప్పుడు అది లేదని, ప్రస్తుతం పల్లె, పట్టణం తేడా లేకుండా డ్రగ్స్ సమాజాన్ని పట్టి పీడిస్తున్నాయని సీఎం రేవంత్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. మనం ఏ స్థాయిలో ఉన్నా, ఎంత సంపాదించినా మన పిల్లలు బాగుండాలని కోరుకుంటామని, ఆ పిల్లలే డ్రగ్స్ బారిన పడితే ఎలా ఉంటుందని ఆయన ప్రశ్నించారు. తెలంగాణకు ఆంధ్ర-ఒడిశా సరిహద్దు (ఏవోబీ) మిగతా.. 2లో



## నీట్ దోషులను వదిలే ప్రసక్తి లేదు

- లోక్‌సభలో ప్రధాని మోడీ వెల్లడి

న్యూఢిల్లీ,జూలై2(నమస్తే ఉదయం): నీట్ యూజీ పేపర్ లీక్ అంశం దేశాన్ని కుదిపేస్తోంది. ఈ అంశంపై పార్లమెంట్‌లో ప్రధాని మోదీ స్పందించారు. మిగతా.. 2లో



## లోక్ సభ సమావేశాలు నిరవధిక వాయిదా

న్యూఢిల్లీ,జూలై2(నమస్తే ఉదయం): లోక్ సభ సమావేశాలు నిరవధిక వాయిదా పడ్డాయి. జూన్ 24వ తేదీన సమావేశాలు ప్రారంభమైన సంగతి తెలిసిందే. జూన్ 24, 25వ తేదీల్లో కొత్త సభ్యుల ప్రమాణ స్వీకారం జరిగింది. 26వ తేదీన 18వ లోక్ సభ స్పీకర్‌గా ఓం బిర్లా తిరిగి ఎన్నిక అయ్యారు. 27వ తేదీన లోక్ సభ, రాజ్యసభలను ఉద్దేశించి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రసంగించారు. 28వ తేదీను ఉభయ సభల సాధారణ కార్యకలాపాలు జరిగాయి. జూలై 1, 2వ తేదీల్లో రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై సభలో చర్చ జరిగింది. మంగళవారం రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలుపుతూ సభ తీర్మానం చేసింది.ఆ వెంటనే సభను మిగతా.. 2లో

## పుణె శివారు ప్రమాదంలో ఐదుగురు మృత్యువాత

నారాయణఖేడ్,జూలై2(నమస్తే ఉదయం): మహారాష్ట్రలోని పుణె శివారులో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో తెలంగాణకు చెందిన ఐదుగురు యువకులు మృతిచెందారు. సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ నియోజకవర్గానికి చెందిన ఆరుగురు యువకులు అజ్‌మేర్ దర్గా సందర్శనకు వెళ్లారు. తిరుగు ప్రయాణంలో పుణె శివారులోకి రాగానే వీరు ప్రయాణిస్తున్న వాహనం ప్రమాదానికి గురైంది. మహబూబ్ ఖురేషి, ఫిరోజ్, ఖురేషి, రఫిక్, ఫిరోజ్ కురేషి, మజీద్ పటేల్ ఘటనా స్థలిలోనే మృతి చెందారు. తీవ్రంగా గాయపడిన సయ్యద్ అమర్‌ను పుణె ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. మృతులంతా 25 ఏళ్ల లోపు వారేనని పోలీసులు తెలిపారు.

## లోక్‌సభలో రాహుల్ వ్యాఖ్యలు దారుణం

- కోట్లాదిమంది హిందువులకు అవమానం
- దేశానికి రాహుల్ క్షమాపణలు చెప్పితీరాలి
- కేంద్రమంత్రి కిషన్ రెడ్డి డిమాండ్



న్యూఢిల్లీ,జూలై2(నమస్తే ఉదయం): లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ హిందువులపై చేసిన అనుచిత వ్యాఖ్యలు పెద్ద దుమారమే రేపాయి. ప్రధాని మోదీతో పాటు పలువురు కేంద్రమంత్రులు.. రాహుల్ గాంధీ వెంటనే హిందూ సమాజానికి క్షమాపణలు చెప్పాలంటూ డిమాండ్ చేశారు. ఈ క్రమంలోనే తాజాగా రాహుల్ గాంధీ వ్యాఖ్యలపై మరో కేంద్రమంత్రి కిషన్ రెడ్డి స్పందించారు. ప్రభుత్వానికి జవాబుదారీగా, ప్రజల గొంతుకుగా ఉండే ప్రతిపక్ష నేత.. ఇలాంటి బాధ్యతారహిత వ్యాఖ్యలు చేయడం సమంజసం కాదన్నారు..నాడు వాజ్‌పేయి, అద్వానీ, సుష్మా స్వరాజ్ లాంటి దిగ్గజాలు ఈ ప్రతిపక్ష నేత పాత్రను ఎంతో బాధ్యతాయుతంగా నిర్వర్తిస్తే.. నేడు అందుకు విరుద్ధంగా మిగతా.. 2లో



జలమండలి ఎండి అశోక్ రెడ్డితో ఉద్యోగ సంఘం నేత రాజిరెడ్డి

## జలమండలి ఎండి అశోక్ రెడ్డిని కలిసిన ఉద్యోగ సంఘం నాయకులు

హైదరాబాద్, జూలై2(నమస్తే ఉదయం): జలమండలి ఎండి గా అశోక్ రెడ్డి పదవి బాధ్యతల స్వీకరించిన సందర్భంగావాటర్ వర్క్స్ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షులు కే రాజిరెడ్డి ఆధ్వర్యంలో మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్కను అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ అసోసియేట్ ప్రెసిడెంట్ మహమ్మద్ జహంగీర్, జనరల్ సెక్రెటరీ శేఖర్, కార్యవర్గ సభ్యులు హాషం బి నర్సింగ్ రావు, అజయ్నాథ్ ,నరసింహారెడ్డి, మోతిరామ్ ,పాండు , సాయికిరణ్ గౌడ్, విశ్వనాధ్ ,సయ్యద్ గౌస్ పాషా, సాయి మల్లిక్ ,రవి, శేఖర్ రెడ్డి, గోపాలకృష్ణ, అశోక్ , ట్రెజరర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.




ఎండి అశోక్ రెడ్డికి పూల మొక్కను అందజేస్తున్న ఉద్యోగ సంఘం ప్రతినిధులు



## ప్రజాభవన్ వేదికగా 6న పరిష్కరించుకుందాం...

- ఏపీ సీఎం చంద్రబాబు చొరవ.. స్వాగతించిన సీఎం రేవంత్
- చర్చల ప్రతిపాదనను స్వాగతిస్తూ చంద్రబాబుకు లేఖ
- విభజన సమస్యలను పరిష్కరించుకుందామని వెల్లడి
- ఇరు రాష్ట్రాల సిఎంల నిర్ణయంతో 6న చర్చలకు రంగం సిద్ధం
- ప్రజాభవన్ వేదికగా అధికారుల ముమ్మర ఏర్పాట్లు




హైదరాబాద్,జూలై2(నమస్తే ఉదయం): విభజన సమస్యల పరిష్కారం కోసం భేటీ అవుదామంటూ ఏపీ సీఎం చంద్రబాబు రాసిన లేఖపై తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి సానుకూలంగా స్పందించారు. చర్చల ప్రతిపాదనను ఆహ్వానిస్తూ ఈమేరకు చంద్రబాబుకు లేఖ రాశారు. ఈ నెల 6న హైదరాబాద్‌లోని ప్రజాభవన్ వేదికగా చర్చిద్దామని ఆహ్వానించారు. విభజన సమస్యలను కలిసి పరిష్కరించుకుందాం. తెలుగు రాష్ట్రాల పరస్పర సహకారానికి ముఖాముఖి చర్చలు అవసరం. మీ అభిప్రాయంతో పూర్తిగా ఏకీభవిస్తున్నానని పేర్కొన్నారు. మా రాష్ట్ర ప్రభుత్వం, ప్రజల తరఫున చంద్రబాబును ఆహ్వానిస్తున్నాం అని రేవంత్‌రెడ్డి లేఖలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎన్నికల్లో విజయం మిగతా.. 2లో

## విలీన పంచాయితీలను తెలంగాణలో కలపాలి

- పాలనాపరమైన ఇబ్బందులు అధిగమించాలి
- సిఎంల చర్చలో ప్రతిపాదించాలంటూ మంత్రి తుమ్మల లేఖ

ఖమ్మం,జూలై2(నమస్తే ఉదయం): ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ విభజన సందర్భంగా నవ్యాంధ ప్రదేశ్‌లో విలీనమైన భద్రాచలం మండలంలోని ఐదు గ్రామ పంచాయతీలను తెలంగాణలో విలీనం చేసేలా చొరవ తీసుకోవాలంటూ సీఎం రేవంత్ రెడ్డికి వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు లేఖ రాశారు. ఈనెల ఆరో తేదీన ఆంధ్రప్రదేశ్, తెలంగాణ



సీఎంలు చంద్రబాబు, రేవంత్ రెడ్డి భేటీ నేపథ్యంలో లేఖ రాయడం ప్రాధాన్యత సంతరించుకుంది. ఏపీలో విలీనమైన ఎటపాక, గుండాల, పురుషోత్తమపట్నం, కన్నాయిగూడెం, పిచుకులపాడు పంచాయతీలను భద్రాచలంలో కలపాలంటూ మంత్రి లేఖలో పేర్కొన్నారు. ఈ పంచాయితీల విలీనం కారణంగా అనేక సమస్యలు వస్తున్నాయని తెలిపారు. రాష్ట్ర విభజన సందర్భంగా ఏపీలో మొత్తం మిగతా.. 2లో



## ఊపందుకున్న మంత్రివర్గ విస్తరణ

- గవర్నర్‌తో స్పీకర్, మండలి ఛైర్మన్ భేటీ
- ప్రత్యేకంగా కలిసిన సిఎస్ శాంతికుమారి
- నేడు ఢిల్లీకి వెళ్లనున్న సిఎం రేవంత్?

హైదరాబాద్,జూలై2(నమస్తే ఉదయం): మంత్రివర్గ విస్తరణపై ఊహాగానాలు ఊపందుకున్నాయి. ఇప్పటికే సిఎం రేవంత్ రెడ్డి గవర్నర్ రాధాకృష్ణన్‌ను కలవగా తాజాగా మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, సిఎస్ శాంతికుమారిలు వేర్వరుగా గవర్నర్‌ను కలిశారు. ఎక్కువసార్లు గెలిచిన ఎమ్మెల్యేలు, ఎన్నికల ముందు చేరికల సమయంలో ఇచ్చిన హామీలు, సామాజిక న్యాయం తదితర అంశాల ప్రాతిపదికన విస్తరణ జరుగుతుందని పార్టీవర్గాలు పేర్కొంటున్నాయి. సీఎం రేవంత్‌రెడ్డి ఈ నెల 3న ఢిల్లీకి వెళ్లే అవకాశముంది. గత వారం ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ ఇంట్లో జరిగిన సమావేశంలో సీఎంతోపాటు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి, పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జి దీపా దాస్‌మున్షీ పాల్గొన్నారు.

మిగతా.. 2లో



## ఆన్‌లైన్‌లో సీఎంఆర్‌ఎఫ్..
# దరఖాస్తులు

- ఇక ఆన్‌లైన్‌లో సీఏం రిలీఫ్‌ఫండ్ దరఖాస్తులు
- వెబ్‌సైట్‌ను ప్రారంభించిన సిఎం రేవంత్ రెడ్డి

హైదరాబాద్,జూలై2(నమస్తే ఉదయం): సీఎంఆర్‌ఎఫ్ దరఖాస్తుల స్వీకరణపై తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఇకపై ప్రజల నుంచి వచ్చే దరఖాస్తులను ఆన్‌లైన్‌లో మాత్రమే స్వీకరించనుంది. ఈ మేరకు వెబ్‌సైట్‌ను సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభించారు. ఈనెల 15 వరకు ప్రజల నుంచి ఆఫ్‌లైన్‌లో వచ్చే వినతులను అధికారులు స్వీకరిస్తారు. ఆ తర్వాత నుంచి ఆన్‌లైన్‌లో మాత్రమే సీఎంఆర్‌ఎఫ్ దరఖాస్తుల స్వీకరణ ఉంటుందని ప్రభుత్వం స్పష్టం చేసింది. అనారోగ్యం బారిన పడిన వారు వైద్య చికిత్సకు ప్రభుత్వ సాయం కోసం సీఎంఆర్‌ఎఫ్‌లో దరఖాస్తు చేసుకునే వీలుంటుంది. పరిశీలన అనంతరం ప్రభుత్వం అర్హత కలిగిన వారికి సాయం అందజేస్తుంది. పారదర్శకత కోసమే ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది.



## సిఎం రేవంత్‌తో నోకియా బృందం భేటీ

హైదరాబాద్,జూలై2(నమస్తే ఉదయం): సచివాలయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో నోకియా జర్మనీ ప్రతినిధి బృందం మర్యాదపూర్వక భేటీ అయ్యింది. ఈ భేటీలో పాల్గొన్న నోకియా గ్లోబల్ హెడ్ మార్టిన్, సేల్స్ హెడ్ మ్యాన్క్, గ్లోబల్ డైరెక్టర్ వెంకట్, రాజేష్, సీస్ రావ్, పద్మజ, ఎమ్మెల్యే మదన్ మోహన్ ఉన్నారు.

అలాగే సచివాలయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఇండియన్ పారా సైక్లింగ్ టీమ్ మర్యాదపూర్వకంగా కలిసింది.

## విలీన పంచాయితీలను తెలంగాణలో కలపాలి

మొదటిపేజీ తరువాయి..

ఏడు మండలాలు విలీనం అయ్యాయి. భద్రాచలం పట్టణం మినహా మండలంలోని గ్రామ పంచాయతీలు ఏపీలో విలీనం అయిన సంగతి తెలిసిందే. శ్రీరాముడు కొలువైన రామాలయంతో టెంపుల్ టౌన్‌గా భద్రాచలాన్ని ఏర్పాటు చేశారు. పట్టణం శివారు నుంచి ఆంధ్రప్రదేశ్‌లో విలీనకావడంతో డంపింగ్ యార్డుకు సైతం స్థలం లేక ఇబ్బందులు ఎదురవుతున్నట్లు మంత్రి తెలిపారు. భద్రాచలం- చర్ల ప్రధాన రహదారిలో ఎటపాక గ్రామ పంచాయతీ ఆంధ్రాలో కలవడంతో అంతరాష్ట్ర సరిహద్దు సమస్యలు తలెత్తుతున్నాయని మంత్రి వివరించారు. విలీన గ్రామాల వల్ల భద్రాచలం నుంచి చర్ల వెళ్లేవారికి రాకపోకల్లో, అధికారులకు సాంకేతిక, పాలనాపరమైన సమస్యలు ఎదురవుతున్నట్లు పేర్కొన్నారు. భద్రాచలం రామాలయం దేవస్థాన భూములు పురుషోత్తమపట్నం గ్రామంలో ఉండటంతో ఆలయ అధికారుల పర్యవేక్షణకు పాలనాపరమైన ఇబ్బందులు వస్తున్నట్లు మంత్రి తుమ్మల లేఖలో సీఎంకు వివరించారు. భద్రాచలం ఆనుకొని ఉన్న 5గ్రామ పంచాయతీలు తమను తెలంగాణలో కలపాలంటూ తీర్మానాలు చేశారని చెప్పారు. ప్రజల ఇష్టాన్ని దృష్టిలో పెట్టుకొని భౌగోళిక పరమైన విభజనతో ఇబ్బందులు పడుతున్న గ్రామ పంచాయితీలను తిరిగి తెలంగాణలో కలపాలని విజ్ఞప్తి చేశారు. ఇద్దరు ముఖ్యమంత్రులు పరిపాలనా సౌలభ్యం, ప్రజా సంక్షేమం కోసం భద్రాచలంలో కలిపేలా నిర్ణయం తీసుకోవాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సీఎం రేవంత్ రెడ్డిని కోరారు. ఇదిలావుంటే ఇదే విషయమై మాజీమంత్రి హరీషా రావు కూడా డిఆండ్ చేశారు.

## లోక్‌సభలో రాహుల్ వ్యాఖ్యలు దారుణం

మొదటిపేజీ తరువాయి..

రాహుల్ గాంధీ వ్యవహరించారని కిషన్ రెడ్డి ధ్వజమెత్తారు. ప్రతిపక్ష నేతగా రాహుల్ గాంధీ తన తొలి ప్రసంగంలో బాధ్యతారహిత వ్యాఖ్యలు చేశారని మండిపడ్డారు. లోక్‌సభ వేదికగా రాహుల్ గాంధీ హిందువులపై విద్వేషపూరితమైన వ్యాఖ్యలు చేసి.. ఆయనకు హిందూ సమాజంపై ఉన్న వ్యతిరేకతను మరోసారి తన వ్యాఖ్యల్లో రుజువు చేసుకున్నారన్నారు. ప్రధాని మోదీతో పాటు బీజేపీ పార్టీపై ఉన్న ద్వేషాన్ని రాహుల్ గాంధీ మరోమారు చూపించారన్నారు.

హిందువులను అవమానించడం ఇండియా కూటమికి ఇదేం కొత్తకాదని.. గతంలోనూ కాంగ్రెస్, ఆ పార్టీలోని కూటమి సభ్యులు పలుసార్లు హిందూ సమాజంతో పాటు సనాతన ధర్మాన్ని సైతం అవమానించారని కిషన్ రెడ్డి చెప్పారు. 2014లో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు హిందువులను శిక్షించే విధంగా మత హింస బిల్లును రూపొందించేందుకు కాంగ్రెస్ ప్రయత్నించిందని గుర్తు చేశారు. కాగా, లోక్‌సభలో హిందువులపై ద్వేషపూరిత ప్రసంగం చేసిన రాహుల్ గాంధీ.. మొత్తం హిందూ సమాజానికి క్షమాపణలు చెప్పాలని కిషన్ రెడ్డి డిమాండ్ చేశారు .

## నీట్ దోషులను వదిలే ప్రసక్తి లేదు

మొదటిపేజీ తరువాయి..

రాష్ట్రపతి ప్రసంగంపై ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై మంగళవారం ఆయన మాట్లాడారు. ఆ క్రమంలో పేపర్ లీకేజీ అంశంపై విచారం వ్యక్తం చేశారు. పేపర్ లీకేజీకి కారణమైన వారిని ఎట్టి పరిస్థితుల్లో వదిలిపెట్టబోమని విద్యార్థులకు హామీనిచ్చారు. నీట్ అక్రమాలపై విచారణ జరపాలని విద్యాశాఖ కోరడంతో సీబీఐ రంగంలోకి దిగింది. నీట్ పరీక్షకు సంబంధించి బీహార్ సహా రాజస్థాన్, గుజరాత్‌లో సీబీఐ అధికారులు కేసు నమోదు చేశారు. ఆరుగురిని అదుపులోకి తీసుకున్నారు. జార్ఖండ్ హజారిబాగ్ ఓయాసిస్ స్కూల్‌లో అక్రమాలకు పాల్పడ్డారని గుర్తించారు. తప్పు చేసిన ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్‌ను అరెస్ట్ చేశారు. గుజరాత్ గోధారా స్కూల్‌కు చెందిన ఓనర్ జే జలరాం, జర్నలిస్ట్‌ను అదుపులోకి తీసుకున్నారు. పరీక్షలో సాయం చేస్తామని జలరాం స్కూల్ ఓనర్ అభ్యర్థుల నుంచి రూ.10 లక్షలు డిమాండ్ చేశారని సీబీఐ అధికారులు వివరించారు. నీట్ పరీక్షలో తన కుమారుడు పాస్ అయ్యేందుకు ప్రయాగ్ రాజ్ నైనికి చెందిన డాక్టర్ రూ.4 లక్షలు ఇచ్చారని సీబీఐ అధికారులు గుర్తించారు. కుమారుడితో సహా వైద్యుడు పరారీలో ఉన్నారు.

## లోక్‌సభ సమావేశాలు నిరవధిక వాయిదా

మొదటిపేజీ తరువాయి..

స్పీకర్ ఓం బిర్లా నిరవధికంగా వాయిదా వేశారు. షెడ్యూల్ ప్రకారం బుధవారంతో సభా సమావేశాలు ముగియాల్సి ఉంది. ఒకరోజు ముందే సమావేశాలు వాయిదా వేశారు. నీట్ యూజీ పేపర్ లీక్ అంశంపై సభలో చర్చ జరపాలని విపక్ష నేత రాహుల్ గాంధీ ప్రధాని మోదీకి లేఖ రాశారు. కానీ అంతలోనే సభ వాయిదా పడింది. రాష్ట్రపతి ప్రసంగంపై ప్రధాని మోదీ ధన్యవాదాలు తెలిపే ప్రసంగం తర్వాత సభ వాయిదా పడింది. సభ నియమాల ప్రకారం నిర్దేశించిన అంశంపై మాత్రమే చర్చించేందుకు అవకాశం ఉంటుంది. ప్రత్యేక చర్చ జరపాలంటే బీఏసీలో నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుంది.

## ఊపందుకున్న మంత్రివర్గ విస్తరణ

మొదటిపేజీ తరువాయి..

మళ్లీ వీరంతా పాల్గొంటారా... ముఖ్యమంత్రే అధిష్ఠానంతో చర్చించి ఖరారు చేస్తారా అన్నది చూడాల్సి ఉంది. నిబంధనల ప్రకారం మంత్రివర్గంలోకి మరో ఆరుగురిని తీసుకోవచ్చు. ప్రస్తుతం నలుగురు,ఐదుగురికి అవకాశం ఇస్తారని, మిగిలిన ఖాళీలను తర్వాత నింపుతారని తెలుస్తోంది. మంత్రులతోపాటు ఉప సభాపతి, చీఫ్ విప్, పీసీసీ అధ్యక్షుడిని ఎంపిక చేసే అవకాశముంది. మొత్తంగా ఏడెనిమిది మందికి ఈ పదవులు లభించొచ్చు. ఉమ్మడి నిజామాబాద్, ఆదిలాబాద్, రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాలకు ప్రస్తుతం మంత్రివర్గంలో ప్రాతినిధ్యం లేదు. ఉమ్మడి రంగారెడ్డి నుంచి స్పీకర్ ఉన్నారు. ఇదే జిల్లా నుంచి మల్‌రెడ్డి రంగారెడ్డి, పరిగి ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి తమ ప్రయత్నాల్లో ఉన్నట్లు సమాచారం. హైదరాబాద్‌లో కాంగ్రెస్ టికెట్‌పై గెలిచిన వారెవ్వరూ లేరు. భారాస నుంచి దానం నాగేందర్ చేరినా, ఇతర పార్టీల నుంచి వచ్చిన వారికి మంత్రివర్గ విస్తరణలో అవకాశం ఉండదని సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టంచేశారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా నుంచి ప్రస్తుతం జూపల్లి కృష్ణారావు ఉండగా, ఎన్నికల సమయంలో రేవంత్‌రెడ్డి స్వయంగా ప్రకటించినందున మక్తల్ ఎమ్మెల్యే శ్రీహరి ముదిరాజ్‌కు అవకాశం రానుంది. ఉమ్మడి నిజామాబాద్ నుంచి సీనియర్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి సుదర్శన్‌రెడ్డి పేరు బలంగా వినిపిస్తోంది. ఎన్నికల ముందు కాంగ్రెస్‌లో చేరేటప్పుడు ఇచ్చిన హామీ మేరకు కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డికి పదవి దక్కుతుందని కాంగ్రెస్ వర్గాలు చెబుతున్నాయి. ఉమ్మడి నల్గొండ నుంచే దేవరకొండ ఎమ్మెల్యే బాలూనాయక్ పేరు కూడా వినిపిస్తోంది.

ఉమ్మడి ఆదిలాబాద్ నుంచి చెన్నూరు ఎమ్మెల్యే వివేక్‌కు అవకాశముండగా, మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమసాగర్‌రావు గట్టిగా ప్రయత్నిస్తున్నారని పార్టీవర్గాలు తెలిపాయి. ఉమ్మడి వరంగల్ నుంచి నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి కూడా గట్టిగానే ప్రయత్నిస్తున్నట్లు తెలిసింది. ఎవరి ప్రయత్నాలు ఎలా ఉన్నా... మంత్రివర్గ విస్తరణలో సామాజిక సమీకరణాలు కీలక భూమిక పోషించనున్నాయి. పీసీసీ అధ్యక్ష పదవిని బీసీలకు ఇస్తే... లంబాడాల నుంచి ఒకరికి ఉపసభాపతి లేదంటే చీఫ్ విప్ దక్కే అవకాశమున్నట్లు తెలుస్తోంది. ఈ పదవుల్లో ఒకదానికి డోర్నకల్ ఎమ్మెల్యే రామచంద్రునాయక్ పేరును సైతం పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. పీసీసీ అధ్యక్ష పదవిని ఎస్టీలకిస్తే ఇతర పదవుల్లో సమీకరణాలు మారతాయి. బుధవారం నుంచి కాంగ్రెస్ అధిష్ఠానంలోని ముఖ్య నాయకులు అందుబాటులో ఉంటారు. అదేరోజు సీఎంతో ఇతర నాయకులు దిల్లీకి వెళ్లి తుది నిర్ణయం తీసుకొనే అవకాశముంది. పీసీసీ నూతన అధ్యక్షుని నియామకంపై తుది నిర్ణయం కోసం కాంగ్రెస్ ముఖ్య నాయకులు మరోసారి దిల్లీకి వెళ్లనున్నారు. ఇప్పటికే కొంత కసరత్తు జరిగినా, ఈ వారంలో తుది నిర్ణయం తీసుకొనే అవకాశం ఉండటంతో మరోసారి పార్టీ అధిష్ఠానంతో చర్చించనున్నారు.

# ప్రజాభవన్ వేదికగా 6న పరిష్కరించుకుందాం...

మొదటిపేజీ తరువాయి..

సాధించిన కూటమి ప్రభుత్వానికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ క్రమంలో తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రుల సమావేశం ఈనెల 6న హైదరాబాద్‌లో జరగనుంది. తెలంగాణ, ఏపీ ముఖ్యమంత్రులు రేవంత్ రెడ్డి, చంద్రబాబు నాయుడు మధ్య కీలక భేటీకి అధికార యంత్రాంగం ఏర్పాట్లు చేస్తోంది. విభజన సమస్యలు పరిష్కరించుకునేందుకు సమావేశం ఏర్పాటు చేయాలని చంద్రబాబు నాయుడు రాసిన లేఖకు సీఎం రేవంత్ రెడ్డి సానుకూలంగా స్పందించారు. సమావేశంలో చర్చించాల్సిన అజెండాను తెలంగాణ ప్రభుత్వం సిద్ధం చేస్తోంది. ఈనెల 6న జరిగే సమావేశానికి ఏర్పాట్లు చేయాలని అధికార యంత్రాంగాన్ని సీఎం ఆదేశించినట్టు సమాచారం. సహచర మంత్రులు, ఉన్నతాధికారులతోనూ ఈ విషయమై సీఎం రేవంత్‌రెడ్డి చర్చించనున్నారు. పునర్విభజన చట్టంలోని తొమ్మిదో షెడ్యూల్‌లో ఉన్న ఆర్టీసీ, రాష్ట్ర ఆర్థిక సంఘం తదితర 23 కార్పొరేషన్ల ఆస్తులపై రెండు రాష్ట్రాల మధ్య ఏకాభిప్రాయం కుదరలేదు. పదో షెడ్యూల్‌లోని తెలుగు అకాడమీ, అంబేడ్కర్, తెలుగు యూనివర్సిటీ వంటి 30 సంస్థల ఆస్తులు, సేవలపై కూడా భిన్నాభిప్రాయాలు ఉన్నాయి. రాజ్ భవన్, హైకోర్టు, లోకాయుక్త, కార్మిక సంక్షేమ నిధి, వాణిజ్య పన్నులు, విద్యుత్ సంస్థల బకాయిలపైనా వివాదాలు ఉన్నాయి. రెండు రాష్ట్రాల అధికారులతో కేంద్ర హోంశాఖ పలు సమావేశాలు నిర్వహించి నప్పటికీ సమస్యలు పరిష్కారం కాలేదు. ముఖ్యమైన చిక్కులను ముఖాముఖి చర్చలతో పరిష్కరించు కోవాల్సిన అవసరం ఉందని ఏపీ సీఎం చంద్రబాబు చొరవ చూపడంతో.. ఏళ్లు తరబడి పెండింగులో ఉన్న విభజన సమస్యలు కొలిక్కి రావొచ్చని ఇరు రాష్ట్రాలు ఆశిస్తున్నాయి. మరోవైపు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు లేఖ రాశారు. తెలంగాణ ఆవిర్భావం నుంచి ఈ ప్రాంత వాసుల్లో చర్చనీయాంశంగా ఉన్న ఖమ్మం జిల్లా భద్రాచలం విలీన గ్రామపంచాయతీలపై ప్రత్యేక చొరవ తీసుకోవాలని లేఖలో పేర్కొన్నారు. ఏపీలో విలీనమైన ఏటపాక, గుండాల, పురుషోత్తమపట్నం, కన్నాయిగూడెం, పిచుకులపాడు గ్రామ పంచాయతీలను తిరిగి భద్రాచలంలో కలపాలని కోరారు. విభజన సమస్యలపై చర్చించేందుకు ఈ నెల 6న హైదరాబాద్‌లో సమావేశం ఏర్పాటు చేయాలని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డికి.. ముఖ్యమంత్రి చంద్రబాబు సోమవారం లేఖ రాశారు. 'ఆంధ్రప్రదేశ్ విభజన జరిగి పదేళ్లవుతోంది. విభజన చట్టం అమల్లో భాగంగా ఉత్పన్నమైన సమస్యలపై పలు దఫాలుగా చర్చలు జరిగినా.. పరిష్కారం కాని అంశాలు ఇంకా ఉన్నాయి. వీటికి సామరస్యపూర్వక పరిష్కారం సాధించేందుకు కట్టుబడి ఉన్నాం. రెండు రాష్ట్రాల సంక్షేమం, పురోగతికి దోహదపడేలా ముఖ్యమైన చిక్కులను పరిష్కరించుకోవాల్సిన అవసరం ఉంది' అని చంద్రబాబు అభిప్రాయపడ్డారు. 'ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ఉమ్మడి ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని ముఖాముఖి చర్చల ద్వారా కీలక అంశాలను పరిష్కరించుకునేందుకు వీలుంటుంది. ఈ చర్చలు మంచి ఫలితాలిస్తాయనే నమ్మకం ఉంది' అని లేఖలో చంద్రబాబు పేర్కొన్నారు. 'ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో సుస్థిర ప్రగతి సాధించడానికి.. పరస్పర సహకారం అవసరం. తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులుగా ఇది మన బాధ్యత. ప్రజల అభ్యున్నతికి దోహదపడేలా.. ఉమ్మడి లక్ష్యాలను సాధించేందుకు ఇది కీలకం' అని వివరించారు. తెలంగాణ అభివృద్ధి, ప్రగతికి రేవంత్‌రెడ్డి చేస్తున్న కృషిని చంద్రబాబు ప్రశంసించారు.

## వినూత్నంగా ఆలోచించండి



మొదటిపేజీ తరువాయి..

ప్రాదాన్యమివ్వాలని సీఎం చెప్పారు. వేళాపాళలను తప్పనిసరిగా పాటించాలని, ప్రతి రోజు టైమ్ ప్రకారం సెక్రెటేరియట్లో అందుబాటులో ఉండాలని కోరారు. కేవలం ఆఫీసులకు పరిమితం కాకుండా తమ విభాగం పనితీరును పర్యవేక్షించేందుకు వారానికి ఒక రోజు విధిగా జిల్లాలకు క్షేత్ర పర్యటనకు వెళ్లాలని ఆదేశించారు. నెలకోసారి అన్ని జిల్లాల ఉన్నతాధికారులతో సమావేశం ఏర్పాటు చేసుకోవాలని, సంబంధిత విభాగం చేపట్టిన కార్యక్రమాలు, జరుగుతున్న పనుల పురోగతిని తెలుసుకోవాలని సూచించారు. చాలా జిల్లాల్లో కలెక్టర్లు ఆఫీసులు దాటడం లేదని ముఖ్యమంత్రి అసంతృప్తి వ్యక్తం చేశారు. ఐఏఎస్ అధికారులు ప్రజలకు ఉపయోగపడే పనులు చేయాలని, తమ అనుభవంతో సుపరిపాలన విధానాలు అమలు చేయాలని సూచించారు. విధిగా కలెక్టర్లు కూడా క్షేత్ర పర్యటనకు వెళ్లేలా చూడాలని ముఖ్యమంత్రి సీఎస్ను ఆదేశించారు. ఆసుపత్రులు, అంగన్వాడీ కేంద్రాలు, పాఠశాలలు, ప్రభుత్వ సేవలందించే అన్ని విభాగాలను అప్పుడప్పుడు విజిట్ చేయాలని చెప్పారు. ప్రజల సమస్యలు, ఇబ్బందులు, అనూహ్యంగా జరిగే సంఘటనలు, దుర్ఘటనలన్నింటా అధికారులు సత్వరమే స్పందించాలని కోరారు.

అన్ని శాఖల్లో మెరుగైన విధానాలు అమలు చేయాల్సిన బాధ్యత అధికారులదేనని సీఎం గుర్తు చేశారు. వ్యక్తుల ఇష్టాయిష్టాలతో తమ ప్రభుత్వానికి సంబంధం లేదని ముఖ్యమంత్రి తేల్చి చెప్పారు. వ్యక్తిగతంగా అధికారులపై రాగద్వేషాలేమీ లేవని, కేవలం పని తీరు ఆధారంగానే అధికారులకు తదుపరి ఉన్నత అవకాశాలుంటాయని, బాగా పని చేసే వారికి ప్రోత్సాహకాలుంటాయని సీఎం అధికారులకు భరోసా ఇచ్చారు. లేనిపోని సొంత నిర్ణయాలతో ప్రభుత్వానికి చెడ్డపేరు తేవద్దని, ముఖ్యమంత్రి కార్యాలయం ఇచ్చే సలహాలు సూచనలు పాటించాలని చెప్పారు. త్వరలోనే వారానికో జిల్లా పర్యటనకు వెళుతానని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ సమావేశంలో వెల్లడించారు. ప్రభుత్వ పథకాలు, అభివృద్ధి పనులతో పాటు క్షేత్ర స్థాయిలో వివిధ కార్యక్రమాల అమలు తీరును స్వయంగా పరిశీలిస్తానని చెప్పారు. అక్కడి ప్రజలను కలుసుకునేలా తన పర్యటన ఉంటుందని అధికారులను అప్రమత్తం చేశారు.

త్వరలోనే తన జిల్లా పర్యటనల షెడ్యూలు విడుదల చేస్తామని చెప్పారు.

# సైనికుల్లా పనిచేయండి

మొదటిపేజీ తరువాయి..

నుంచి గంజాయి వస్తోందనే సమాచారం ఉందని తెలిపారు. చొరబాట్లు, ఇతర సమస్యలు రాకుండా దేశ సరిహద్దుల్లో సైన్యం మాదిరిగానే రాష్ట్ర సరిహద్దుల్లోనూ పోలీసులు అలా అప్రమత్తంగా ఉండి, పహారా కాసి తెలంగాణలోకి గంజాయి మొక్క, డ్రగ్స్ రాకుండా చూడాలని సీఎం రేవంత్ రెడ్డి సూచించారు.

హైదరాబాద్ నగరంలోని మూడు పోలీసు కమిషనరేట్ల పరిధిలోని ఇన్‌స్పెక్టర్లు, ఆపై స్థాయి అధికారులతో కమాండ్ కంట్రోల్ సెంటర్ (సీసీసీ)లో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రసంగించారు. మారుతున్న కాలానికి అనుగుణంగా పోలీసు శాఖలో సీబీసీఐడీ, ఏసీబీ, గ్రేహౌండ్స్, ఆక్టోపస్ వంటి విభాగాలు ఏర్పాటు చేశారని, ప్రస్తుతం సైబర్ నేరాలు, డ్రగ్స్ సమాజాన్ని పట్టి పీడిస్తున్నందున సైబర్ సెక్యూరిటీ బ్యూరో, యాంటీ నార్కొటిక్స్ బ్యూరో ఏర్పాటయ్యాయన్నారు. డ్రగ్స్, సైబర్ నేరాలు పట్టిపీడిస్తున్నందున వాటిని అరికట్టేందుకు అవసరమైన సామర్థ్యాలను అందిపుచ్చుకోవాలని పోలీసులకు సీఎం రేవంత్ సూచించారు. ఐపీసీ, సీఆర్పీసీల స్థానంలో కేంద్ర ప్రభుత్వం కొత్త చట్టాలు తెచ్చినందున వాటిపైనా పూర్తి అవగాహన తెచ్చుకోవాలని, అందుకు అవసరమైన శిక్షణ తీసుకోవాలన్నారు. అలా శిక్షణ పొందినప్పుడే సమాజం నుంచి నూతనంగా ఏర్పాటయ్యే సవాళ్లను ఎదుర్కొవచ్చని పేర్కొన్నారు. దేశంలో ఎక్కడ తీవ్రవాద, ఉగ్రవాద కదలికలు, అరెస్టులు అయినా, బాంబు పేలుళ్లు జరిగినా అదనపు సమాచారం కోసం కేంద్ర హోంశాఖ నుంచి ఆయా రాష్ట్రాల పోలీసులు తెలంగాణ ఎస్ఐబీ సహకారం కోరతారని సీఎం రేవంత్ రెడ్డి గుర్తుచేశారు. తెలంగాణ రాష్ట్ర పోలీసులు, హైదరాబాద్ పోలీసులపై అందరికీ నమ్మకం ఉందని, నేరగాళ్ల ఆలోచనను, వాళు వేసే ఎత్తుగడలను ముందే గుర్తించి ఆ నేరాలను అరికట్టే ప్రణాళిక రచించి, అందుకు అవసరమయ్యే శిక్షణ పొందుతున్నందునే తెలంగాణ పోలీసుకు జాతీయ స్థాయి గుర్తింపు ఉందని సీఎం అన్నారు. లిబరలైజేషన్, ప్రైవేటైజేషన్, గ్లోబలైజేషన్‌తో మన ఉత్పత్తులు విదేశాలకు, విదేశీ ఉత్పత్తులు మన దేశానికి వస్తున్నట్లే, నేరగాళ్లు సైతం విదేశాల నుంచే ఇక్కడ నేరాలకు పాల్పడుతున్నారని, వాటిని సమర్థంగా ఎదుర్కోవడానికి అవసరమైన నైపుణ్యాలు పెంపొందించుకోవాలని సీఎం రేవంత్ రెడ్డి సూచించారు. పోరాటాలతో ఏర్పడిన తెలంగాణలో పదేళ్లలో ఆశించిన ఫలితాలు రాకపోవడంతో గంజాయి వంటి మాదక ద్రవ్యాలకు బానిసలుగా మారుతున్నారని సీఎం ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి తన అనుభవాలను గుర్తు చేసుకున్నారు. సింగరేణి కాలనీలో ఒక బాధితుని కుటుంబాన్ని, ఔటర్ రింగు రోడ్డులో ఒక బాధితుడైన డాక్టర్‌ను పరామర్శించడానికి వెళితే వారంతా గంజాయికు అలవాటైన వారి వలనే తాము బాధితులుగా మారినట్లు తెలిపారన్నారు. తమ పిల్లలు కార్పొరేట్ స్కూళ్లకు వెళుతున్నారని, తాము రూ.వందల కోట్లు సంపాదించినా ఉపయోగం లేకుండా పోయిందని, తమ పిల్లలు డ్రగ్స్‌కు అలవాటు పడ్డారని పలువురు తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. ఇందుకు ప్రధాన కారణం పోలీసు వ్యవస్థ రాజకీయ నిఘాపై శ్రద్ధ పెట్టి నేరగాళ్లను వదిలివేయడమేనని సీఎం అన్నారు. రాజకీయ వ్యవస్థపై నిఘా తగ్గించి నేరాలపై నిఘా పెట్టి నేరగాళ్లను పట్టుకోవాలని పోలీసు అధికారులకు సీఎం రేవంత్ రెడ్డి సూచించారు. సమాజంలో ఉన్న ప్రజలు ఎన్నుకుంటేనే తాము ప్రజా ప్రతినిధులుగా వచ్చామని, తమకు మితిమీరిన సెక్యూరిటీ అవసరం లేదని, ఎవరికి ఎంత అవసరమో అంతే సెక్యూరిటీ ఇవ్వాలని, భద్రత విషయంలో తనతో సహా ఎవరికీ అధిక ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం లేదని డీజీపికి సీఎం స్పష్టం చేశారు. భద్రత, ఇతర విషయాల్లో కొన్ని సార్లు పోలీసుల అతి ఉత్సాహం చూపుతారని, ఆ ఉత్సాహం, శక్తి నేరాల నియంత్రణపై చూపాలని హితవు పలికారు. పోలీసు కుటుంబాల పిల్లలు రాణించలేరనే అపవాదు సమాజంలో ఉందని, ఇందుక ప్రధాన కారణం విధుల్లో పడి కుటుంబాలకు, పిల్లలకు సరైన సమయం కేటాయించకపోవడమే కారణమని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. అందుకే సైనిక స్కూళ్ల మాదిరే పోలీసు పిల్లల కోసం పోలీసు స్కూళ్లు ఏర్పాటు చేస్తామని ఆయన చెప్పారు. గ్రేహౌండ్స్‌కు చెందిన 50 ఎకరాల స్థలంలో పోలీసు స్కూల్ ఏర్పాటు చేస్తామని, ఆరు నుంచి పీజీ వరకు ఉచిత విద్య అందులో ఉంటుందని, హోంగార్డు నుంచి డీజీపీ పిల్లల వరకు చదువుకోవచ్చని తెలిపారు. సామర్థ్యం, పని తీరుతోనే బదిలీలు కోరుకోవాలని సీఎం రేవంత్ రెడ్డి సూచించారు. సామర్థ్యం ఉన్నవారిని తమ ప్రభుత్వం గుర్తిస్తుందని, అందుకు సందీప్ శాండిల్య ఉదాహరణ, తన ప్రభుత్వంలో రిటైర్ అయిన వారిని పదవీ కాలం పొడిగించిందని ఒక్క సందీప్ శాండిల్యకేననే విషయం గుర్తుంచుకోవాలన్నారు. పోలీసుల పిల్లలు తాము పోలీసుల కుటుంబాల నుంచి వచ్చామని చెప్పుకు నేందుకు ఇబ్బంది పడతారని, అందుకు కారణం పోలీసు శాఖపై సమాజంలో ఉన్న అభిప్రాయమేనని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. ఆ అభిప్రాయం మారాలని, తన తండ్రి, తన అన్న పోలీసు అని గర్వంగా చెప్పుకునేలా మన ప్రవర్తన ఉండాలని సూచించారు. తన అన్న భూపాల్ రెడ్డి వనపర్తిలో కానిస్టేబుల్ గా పని చేసి తనను చదివించారని, తన అన్న పెంపకంతోనే తాను ఈ రోజు సీఎం స్థాయికి వచ్చానని ఆయన వెల్లడించారు. తాను సీఎంగా ఉన్నప్పుడే పోలీసు శాఖ సమస్యలు పరిష్కరించుకోకుంటే జీవితకాలంలో అవి పరిష్కారం కావన్నారు. తాను జడ్పీటీసీ సభ్యునిగా ఉన్నప్పుడు పోలీసు అధికారులంటే ఒక గౌరవం, భయం ఉండేదని, క్రమంగా అది పడిపోయిందని, దానిని పునరుద్ధరించేలా ప్రయత్నించాలని సూచించారు. నేరాల నియంత్రణలో ఎస్‌హెచ్‌వోలే కీలక పాత్ర అని, పైఅధికారుల పని పర్యవేక్షణ మాత్రమేనని, ఈ విషయం గుర్తించి పోలీసులకు వన్నెతెచ్చేలా పని చేయాలని సీఎం సూచించారు. తెలంగాణ బ్రాండే హైదరాబాద్ అని, హైదరాబాద్ పోలీసు అంటే తెలంగాణకు గుండెకాయ అని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. నగరంలో నేరాలను నియంత్రించకపోతే, అరాచకాలను అరికట్టకపోతే తీవ్ర నష్టం వాటిల్లుతుందన్నారు. పోలీసులు అంతా తమ బాధ్యతను ప్రతి రోజు గుర్తుపెట్టుకొని హైదరాబాద్ బ్రాండ్ ఇమేజిని కాపాడాలని ఆయన కోరారు. కార్యక్రమంలో సీఎం రాజకీయ సలహాదారు వేం నరేందర్ రెడ్డి, డీజీపీ రవి గుప్తా, టీజీ న్యాబ్ డీజీ సందీప్ శాండిల్య, సైబర్ సెక్యూరిటీ బ్యూరో డైరెక్టర్ శిఖా గోయల్, హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ పోలీసు కమిషనర్లు శ్రీనివాసరెడ్డి, అవినాష్ మహంతి, తరుణ్ జోషి తదితరులు పాల్గొన్నారు.

## 4న సింగూరు జలాలు బంద్
### తాగునీటి సరఫరాకు అంతరాయం

హైదరాబాద్,జూలై2(నమస్తే ఉదయం): హైదరాబాద్ మహానగరానికి గురువారం సింగూరు జలాల సరఫరా బంద్ కానున్నది. నగరంలోని పలు ప్రాంతాలకు దాదాపు 24గంటల పాటు తాగునీటి సరఫరాలో అంతరాయం తలెత్తనుంది. నగరానికి తాగునీటిని సరఫరా చేసే సింగూరు 3, 4 ఫేజ్‌లకు విద్యుత్‌ను సరఫరా చేసే 132 కేవీ పెద్దాపూర్, కంది సబ్‌స్టేషన్లలో టీజీ ట్రాన్స్‌కో అధికారులు గురువారం ఉదయం ఏడు గంటల నుంచి శుక్రవారం ఉదయం ఏడు గంటల వరకు మరమ్మతు చేయనున్నారు. దీంతో షేక్‌పేట్, జూబ్లీహిల్స్, సోమాజిగూడ, బోరబండ, మూసాపేట్, నల్లగండ్ల, చందానగర్, హుడా కాలనీ, హఫీజ్‌పేట్, మణికొండ, నార్సింగి, మంచిరేవుల ప్రాంతాలకు దాదాపు 24 గంటలపాటు నీటి సరఫరా పూర్తిగా నిలిచిపోనుంది. భోజగుట్ట రిజర్వాయర్, బంజారా, ఎర్రగడ్డ, కేపీహెచ్‌బీ, హైదర్‌నగర్, తెల్లాపూర్, ఓ అండ్ ఎం డివిజన్-8లోని బల్క్ కనెక్షన్లకు పాక్షికంగా నీటి సరఫరాలో అంతరాయం తలెత్తనుంది.

## ఆర్టీసీలో ఖాళీ పోస్టుల భర్తీ

మొదటిపేజీ తరువాయి..

అన్ని పోస్టుల భర్తీకి గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ 3035 పోస్టుల్లో 2000 డ్రైవర్, 743 శ్రామిక్, 114 డిప్యూటీ సూపరింటెండెంట్(మెకానిక్), 84 డిప్యూటీ సూపరింటెండెంట్(ట్రాఫిక్), 25 డిపో మేనేజర్/అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్, 23 అసిస్టెంట్ ఇంజనీర్(సివిల్), 15 అసిస్టెంట్ మెకానికల్ ఇంజనీర్, 11 సెక్షన్ ఆఫీసర్(సివిల్), 7 మెడికల్ ఆఫీసర్(జనరల్), 7 మెడికల్ ఆఫీసర్(స్పెషాలిస్ట్) కొలువులు ఉన్నాయి. ఆర్టీసీలో వివిధ కేటగిరిల్లో 3035 పోస్టులకు ప్రభుత్వం అనుమతి ఇవ్వడంపై రవాణా, బీసీ సంక్షేమ శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్ హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పోస్టుల భర్తీకి అనుమతి ఇచ్చిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్కకు ఆయన ధన్యవాదాలు తెలియజేశారు.



## స్థానిక సంస్థల ప్రతినిధులతోనే గ్రామ ప్రగతి: ఎమ్మెల్యే జిఎంఆర్

**మహిళా అభ్యున్నతే ప్రభుత్వ లక్ష్యం**


**ప్రజా ప్రతినిధులు చేసిన పనులు గుర్తుండిపోతాయి**



**కొత్తకోట, జూలై 2(నమస్తే ఉదయం):** స్థానిక సంస్థల ప్రతినిధులతోనే గ్రామ ప్రగతి సాధ్యమవుతుందని దేవరకద్ర నియోజకవర్గం శాసనసభ్యులు గవినోళ్ల మధుసూదన్ రెడ్డి అన్నారు. మంగళ వారం మదనాపురం మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన మహిళ సమాఖ్య భవనాన్ని ప్రారంభించి పదవి కాలం ముగిసిన ప్రజాప్రతినిధులను సన్మానించి వీడ్కోలు పలికారు.

## వ్యవసాయ ఆధునిక యాంత్రికరణతో రైతుకు ఎంతో మేలు: ఎమ్మెల్యే జీఎంఆర్

**చిన్న చింతకుంట, జూలై2(నమస్తే ఉదయం):** వ్యవసాయంలో ఆధునిక యాంత్రికరణతో రైతుకు ఎంతో లాభదాయకమని దేవరకద్ర నియోజకవర్గం ఎమ్మెల్యే జిఎంఆర్ మంగళవారం నియోజకవర్గ పరిధిలోని చిన్న చింతకుంట మండలం అల్లిపూర్ గ్రామంలో గ్రామ కాంగ్రెస్ మాజీ అధ్యక్షులు ఎం కృష్ణయ్య కుమారుడు సాయి కుమార్ మండలం లో మొదటి సారిగా వ్యవసాయం లో



డ్రోనర్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జిఎంఆర్

ఉపయోగించే అధునాతన డ్రోన్ స్ప్రే (పురుగుల మందు పిచికారీ యంత్రం) ను పరిశీలించి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జిఎంఆర్ మాట్లాడుతూ... రోజురోజుకు వ్యవసాయ కూలీల కొరత నేపథ్యంలో యాంత్రికరణ పై రైతులు దృష్టి సారించాలన్నారు.

## తప్పిపోయిన పిల్లలను తల్లి వద్దకు చేర్చిన ట్రాఫిక్ పోలీసులు


**రాజేంద్రనగర్,జులై 02 (నమస్తే ఉదయం):** ఇంటి వద్ద ఆడుకుంటూ ఇద్దరు పిల్లలు శంషాబాద్ రైల్వే స్టేషన్ కు చేరుకున్నారు.అక్కడ నిలిచి ఉన్న ట్రైన్ లో ఎక్కి ఆడుతుండగా ట్రైన్ శంషాబాద్ నుంచి సికింద్రాబాద్ కు



బయలుదేరింది.దీంతో పిల్లలు మార్గమధ్యంలో శివరాంపల్లి రైల్వే స్టేషన్ వద్ద ట్రైన్ లో నుంచి దిగిపోయారు.రైల్వే స్టేషన్ నుంచి అరంఘర్ వరకు వచ్చారు.ఆరంఘర్ లోని రాజేంద్రనగర్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ముందు ఇద్దరు పిల్లలు తిరుగుతుండగా ఓ ఆటో డ్రైవర్ వారిని అపహరించేందుకు ప్రయత్నించాడు.ఇద్దరు పిల్లలను గమనించిన ట్రాఫిక్ కానిస్టేబుళ్లు యాదయ్య,శివలు పిల్లలు శివ (6),కార్తీక్ (4)లను పోలీస్ స్టేషన్ లోకి తీసుకువెళ్లారు.పిల్లలను పోలీసులు విచారించగా శంషాబాద్ హుడా కాలనీలోని గుడిసెల్లో తమ తల్లిదండ్రులతో కలిసి ఉంటున్నామని తెలిపారు. వాట్సప్ గ్రూపులో పిల్లల ఫోటోలను షేర్ చేయడంతో పిల్లల తల్లికి సమాచారం అందింది.ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ చేరుకున్న తల్లికి ట్రాఫిక్ సీఐ నరసింహ పిల్లలను అప్పగించారు.

## దొనురు వెంకట్ రామ్ రెడ్డికి నివాళులర్పించిన కేంద్ర ప్రత్యేక ప్రతినిధి ఏపీ జితేందర్ రెడ్డి

**అడ్డాకుల్, జూలై2(నమస్తే ఉదయం):** అడ్డాకుల ఎంపీపీ దోనూరు నాగార్జున రెడ్డి తండ్రీ దొనూరు వెంకట్ రా మ్ రెడ్డి కి ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి ఏపీ జితేందర్ రెడ్డి నివాళులర్పించారు. మంగళవారం జరిగిన దొనూరు వెంకట్ రా మ్ రెడ్డి దశదిన కర్మ కార్యక్రమంలో ఏపీ జితేందర్ రెడ్డి, రిటైడ్ ఏ ఎస్పి ఎం ప్రభాకర్ రెడ్డి, సీనియర్ నాయకుడు ఎం భీమ్ రెడ్డి,ఎం.అనంత రెడ్డి, ఎం యుగంధర్ రెడ్డి, ఎం చక్ర వర్ధన్ రెడ్డి లు పాల్గొన్నారు.



# వ్యవసాయ, ఉద్యాన, పట్టు పరిశ్రమల శాఖల పనితీరుపై సమీక్ష

**రాజేంద్రనగర్, జూలై2(నమస్తే ఉదయం) :** రాజేంద్రనగర్ లోని తెలంగాణ రాష్ట్ర గ్రామీణ అభివృద్ధి సంస్థలో మంగళవారం వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు అన్ని జిల్లాల వ్యవసాయ, ఉద్యాన, పట్టు పరిశ్రమల శాఖ అధికారులతో సమీక్షా సమేవేశం నిర్వహించారు.

ఈ సందర్బంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ మొట్టమొదటి ప్రాధాన్యత రైతు సంక్షేమమని అన్నారు. రానున్న మూడు నెలల కాలములో రూ.50 నుండి 60 వేల కోట్ల రూపాయలు రైతుల రుణమాఫీ, రైతు భరోసా, పంట భీమ, రైతూ భీమ, పథకాలతో ఖర్చు చేయబోతుందని తెలిపారు. ఇది ప్రభుత్వానికి భారమైన కూడా ముఖ్యమంత్రి ఇచ్చిన మాటకు కట్టుబడి సాహెూసోపెతమైన నిర్ణయాలు అమలు చేస్తున్నామని అన్నారు. ఈ సందర్భములో వ్యవసాయ శాఖా ఉద్యాన వన శాఖా అధికారులు భాధ్యతతో నిబద్దతతో వారి విధులను నిర్వర్తించాలని కోరారు .

రానున్న పదేళ్ళ కాలములో అన్ని వనరులు పుష్కలముగా ఉన్న తెలంగాణా రాష్ట్రమును వ్యవసాయ రంగంలో అగ్రగామిగా నిలబెట్టే గురుతర భాద్యత మన మీద ఉందని తెలిపారు.

రైతుకు తోడుగా ఉండి ఆర్థికంగా నిలబెట్టాలి, మళ్ళీ తలెత్తుకొని జీవించేలా చెయ్యాలి అనే ఆశయంతో ఈ ప్రభుత్వం పనిచేస్తుందని అన్నారు. అందుకనే రుణమాఫీ అమలు చేస్తున్నామని, రానున్న కాలంలో ఆర్థిక వెసులుబాటు బట్టి ఒక్కొక్కటిగా అన్ని పథకాలను పునరుద్దరిస్తామని తెలిపారు. ఇప్పటికే మట్టి నమూనా పరీక్ష కేంద్రాలను తిరిగి వాడుకలోనికి తెచ్చి భుసార పరిక్షలు అరంబించిన విషయం గుర్తు చేసారు.

– వానాకాలంలో విత్తనాల సరఫరా రాష్ట్రం అంతటా బాగున్నపటికి ఒకటి రెండు కంపెనీల విత్తనాల విషయంలో ఒకట్రెండు జిల్లాల్లో ఇబ్బందులు తల్లెత్తితే ఆది రాష్ట్రమంతట ఉన్నట్లు ప్రచారం జరిగిందన్నారు. అందుకనే జిల్లా వ్యవసాయ శాఖ అధికారులు, ఉద్యాన శాఖ అధికారులు గాని రైతులను సంబంధించిన ప్రతివిషయంలో ముందుగా ప్రణాళిక వేసుకొని దాని ప్రకారం ముందుకు పోవాలన్నారు. రాష్ట్ర స్థాయి అధికారుల ప్రోత్సాహం వారి నుండి సహాయ సహకారాలు మీకు ఎప్పుడు ఉంటాయి అన్నారు. రైతు అందరికి అన్నం పెడతాడు అటువంటి వారికీ సేవ చేసే అవకాశం రావడం మనందరి అదృష్టంగా బావించి పనిచేయాలి అని సూచించారు.

– ఎప్పటికప్పుడు వాతావరణ పరిస్థితులు అంచనా



వేసుకుంటూ భూగర్భ జలాలు, ప్రాజెక్ట్ నిల్వలు చూసుకుంటూ ఆ ప్రకారం రైతులకు పంతసగుకు సలహాలు ఇవ్వాలి అన్నారు.

మంత్రి అధికారులతో అనేక విషయములలో దిశానిర్దేశం చేసారు. ఏ పంట వేసుకోవాలి, ఎప్పుడు వేసుకోవాలి, కొత్త పంటలు ఏమి ఉన్నాయి, మార్కెటింగ్ సౌకర్యాలు ఏమిటి, ఇలా అన్ని రైతులకు చెప్పాలన్నారు. రైతుభీమాలో కూడా 1222 క్లేయిమ్స్ వివిధ దశలలో పెండింగ్ లో ఉన్నాయని, ఇంత పెద్ద మొత్తంలో పెండింగ్ ఉంటే చనిపోయిన రైతు కుటుంబాలకు మనం అందించే ఆసరా సకాలంలో అందుతుందా లేదా అన్నది ఏప్పటికప్పుడు పరిశీలించుకోవాలన్నారు.

రైతులకు అన్ని రకాల ఇన్ పుట్ లు నాణ్యమైనవి అందుతున్నాయా, లేదా? నిర్దేశించిన ధరలకే దొరుకుతున్నాయా. లేదా? చూడాలన్నారు.

పంటల నమోదు ప్రక్రియను నిరంతరం పర్యవేక్షించడానికి ప్రతి 5 వేల ఎకరాలకు ఒక ఏఈఓ ఉన్నాడు కాబట్టి పంటల నమోదులో ఖచ్చితత్వం ఉండాలన్నారు. ఇది అన్నిటికి ప్రాతిపదిక. రైతుభరోసాను గానీ, పంటలభీమాకు గానీ, తర్వాత మార్కెటింగ్ కు గానీ ఇదే ఆధారం అని తెలియచేసారు.

ఆయిల్ పామ్ ప్రాజెక్ట్ చేపట్టి 3వ సంవత్సరం ఆరంభంలోకి వచ్చినా, ఇంకా రెండు డిపార్ట్ మెంట్ ల మధ్య క్షేత్రస్థాయిలో సమన్వయం లేదన్నారు. 2023-24 సంవత్సరములో 2.30 లక్షల ఎకరాల లక్ష్యానికి గాను కేవలం 59,200 ఎకరాలు మాత్రమే పురోగతి చూపెట్టారన్నారు. (26 శాతం మాత్రమే)

ఆయిల్ పామ్ కు సంబంధించి అగ్రికల్చర్ ఆఫీసే, ఉద్యాన అధికారి వేరుకాదని, ఉద్యాన అధికారి కు ఎటువంటి బాధ్యతలు ఉన్నాయో, అగ్రికల్చర్ ఆఫీసర్ కు కూడా అటువంటి బాధ్యత ఉన్నదన్నారు

ఉద్యాన విస్తరణ అధికారులు లేరు కాబట్టి వ్యవసాయ విస్తరణ అధికారులు పూర్తి బాధ్యత తీసుకోవాలన్నారు. రైతును ఎంపిక చేయడం నుండి డ్రిప్ ఇన్ స్టాల్ చేయించడం, మొక్కలు నాటించడం వరకు ప్రతిదాని మీద వ్యవసాయ విస్తరణ అధికారి, వ్యవసాయ అధికారి బాధ్యత తీసుకోవాలన్నారు.

ఇకనుండి ప్రతివారం శాస్త్రవేత్తలు మరియు అధికారులు కలిసి ఒక బృందంగా ఏర్పడి జిల్లాలో కనీసం వారానికి రెండు మండలాలు సందర్శించి సలహాలిచ్చే విధంగా, అది జిల్లా వ్యాప్తంగా రైతులకు తెలిసేవిధంగా చూడాలన్నారు. అదేవిధంగా రైతులు అందించే ఇన్ పుట్ ఆధారంగా రైతులకు ఉపయోగపడే విధంగా పరిశోధనలను యూనివర్సిటీ అధికారులు చేపట్టాలన్నారు.

డ్రిప్ ఇరిగేషన్ పరికరాలు సబ్సిడిపై ఆయిల్ పామ్ కే కాకుండా ఇతర పంటలు సాగుచేసే రైతులకు కూడా ఈ సంవత్సరం నుండి ఇస్తున్నామన్నారు. (70, 600 ఎకరాలు) ఉద్యాన పంటల సాగును, కూరగాయల సాగును ప్రోత్సహించండని అన్నారు.

ఈ కార్యక్రములో రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి. ప్రకాష్ గౌడ్, వ్యవసాయ ముఖ్య కార్యదర్శిఎం. రఘునందన్ రావు, వ్యవసాయ డైరెక్టర్ బి. గోపి ఉద్యానవన డైరెక్టర్ యాస్మిన్ బాష , కో ఆపరేటివ్ డైరెక్టర్ ఉదయ కుమార్ , వ్యవసాయ విశ్వవిద్యాలయ పరిశోధన సంచాలకులు డాక్టర్ పి. రఘురామిరెడ్డి , రాజేంద్ర నగర్, మార్కెటింగ్ డైరెక్టర్ లక్ష్మి బాయి , మార్క్ ఫెడ్ మేనేజింగ్ డైరెక్టర్ సత్యనారాయణ రెడ్డి , అధికారులు పాల్గొన్నారు.

# సెప్టిక్ ట్యాంక్ స్థలాన్ని స్వాధీనం చేసుకున్న జీహెచ్ఎంసీ అధికారులు

**ధైర్యంగా కబ్జాదారులతో తలపడిన టౌన్ ప్లానింగ్ ఏసిపి అబ్దుల్ ఖాదర్**

**సంఘటనా స్థలాన్ని సందర్శించి ఆ స్థలం సెప్టిక్ ట్యాంకు కు కేటాయించినది అని తేల్చిన ఎమ్మెల్సీ మీర్జా రహమత్ బేగ్**

**పోలీసుల సమక్షంలోనే అధికారులు, కాలనీవాసులపైకి దూసుకెళ్లిన కబ్జాదారులు**

**రాజేంద్రనగర్, జూలై2(నమస్తే ఉదయం):** రాజేంద్రనగర్ సర్కిల్ గోల్డెన్ హైట్స్ కాలనీలో గతంలో సెప్టిక్ ట్యాంక్ కోసం వదిలిన 200 గజాల స్థలం మాదేనని తప్పుడు పత్రాలు సృష్టించి ఆ స్థలంలో కొందరు కంటైనర్ ఇంటిని పెట్టడంతో కాలనీవాసులు అభ్యంతరం వ్యక్తం చేశారు. కాలనీ వాసుల ఫిర్యాదు మేరకు మంగళవారం టౌన్ ప్లానింగ్ అధికారులు ఆ కంటైనర్ ను తొలగించారు. రాజేంద్రనగర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ కె. రవికుమార్ ఆదేశాలతో టౌన్ ప్లానింగ్ ఏసీపీ అబ్దుల్ ఖాదర్, ఇంజనీరింగ్ విభాగం ఏఈ వెంకోబా, టౌన్ ప్లానింగ్ సిబ్బంది రమేష్ , కరణ్ లు దగ్గరుండీ కంటైనర్ ను తొలగింపజేశారు . ఈ సందర్భంగా కంటైనర్ పెట్టిన వ్యక్తులు గోల్డెన్ హైట్స్ కాలనీ అసోసియేషన్ సభ్యులు, రాజేంద్రనగర్ అధికారులపై పోలీసుల సమక్షంలోనే వాగ్వివాదానికి దిగారు. కంటైనర్ ను తొలగించకుండా అడ్డుకున్నారు. ఒక దశలో ఒక వ్యక్తి కంటైనర్ ను తరలిస్తున్న ట్రాక్టర్ ముందు పడుకొని నిరసన వ్యక్తం చేశాడు.

**ఖాళీ స్థలం జీహెచ్ఎంసీదే : ఎమ్మెల్సీ మీర్జా రహ్మత్ బేగ్**

తమ కాలనీలో 200 గజాల స్థలాన్ని కబ్జాదారులు కాజేయాలని



ఎమ్మెల్సీ మీర్జా రహ్మత్ బేగ్‌కు లే అవుట్‌ను చూపిస్తున్న కాలనీ అసోసియేషన్ సభ్యులు




స్థలం జీహెచ్ఎంసీదేనంటున్న శాసనమండలి సభ్యులు మీర్జా రహ్మత్ బేగ్

చూస్తున్నారని గోల్డెన్ హైట్స్ కాలనీ అసోసియేషన్ ప్రతినిధులు మంగళవారం మజ్లీస్ అధ్యక్షుడు, ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ దృష్టికి తీసుకువచ్చారని ఎమ్మెల్సీ మీర్జా రహమత్ బేగ్ తెలిపారు. అసదుద్దీన్ ఓవైసీ సూచన మేరకు తాను కాలనీ నీ సందర్శించగా, కబ్జాదారులు కంటైనర్ వేసిన స్థలం ఒకప్పుడు సెప్టిక్ ట్యాంకు కోసం వదిలినదేనని తెలిసిందన్నారు. రాజేంద్రనగర్ టౌన్ ప్లానింగ్ విభాగం అధికారులు అందుకు తగ్గ పత్రాలను చూపించడం జరిగిందన్నారు . ఆ స్థలం సెప్టిక్ ట్యాంక్ దేనని, జీహెచ్ఎంసీ దేనని గుర్తు చేశారు.

**ధైర్యంగా పోరాడిన టౌన్ ప్లానింగ్ ఏసీపీ అబ్దుల్ ఖాదర్ :**

తప్పుడు పత్రాలతో గోల్డెన్ హైట్స్ కాలనీలోని సెప్టిక్ ట్యాంక్ స్థలం కబ్జా చేయాలని విఫలయత్నం చేసిన కబ్జాదారులకు టౌన్ ప్లానింగ్ అధికారి అబ్దుల్ ఖాదర్ ముచ్చెమటలు పట్టించాడు. జీహెచ్ఎంసీ స్థలంలో వేసిన కంటైనర్‌ను తొలగించడానికి వెళ్లగా కబ్జాదారులు అడ్డుపడి టౌన్ ప్లానింగ్ అధికారి పైకి దూసుకు వచ్చారు. అయినా ఆయన భయపడకుండా కంటైనర్ ను తొలగింపజేశారు. టౌన్ ప్లానింగ్ విభాగం ఏసీపీ అబ్దుల్ ఖాదర్ ధైర్యానికి కాలనీ వాసులుతో పాటు అక్కడ ఉన్న వారందరూ అభినందనలు తెలియజేశారు.

## కొత్త చట్టాల ప్రకారం రాజోలి పోలీస్ స్టేషన్‌లో మొదటి కేసు నమోదు

**గద్వాల జిల్లా ప్రతినిధి, జూలై 2(నమస్తే ఉదయం):** జోగులాంబ గద్వాల్ జిల్లా పరిధిలోని రాజోలి మండల కేంద్రానికి చెందిన బటికేరి శ్రీనివాసులు అను వ్యక్తి జూలై 1న అనారోగ్య సమస్యలు, కుటుంబ సమస్యల వల్ల జీవితం పై విరక్తి చెంది సుంకేసుల డ్యాం లో దూకి చనిపోయాడు. అతని కుమారుడు బటికేరి భసవరాజు పిర్యాదు మేరకు జూలై 1 నుంచి భారతదేశ కొత్త చట్టాలు అమలు కావడంతో జిల్లా ఎస్పీ టి. శ్రీనివాస రావు అదేశాల మేరకు రాజోలి ఎస్సై జగదీష్ సెక్షన్ 194 బి ఎన్ ఎస్ ఎస్ (భారతీయ నాగరిక్ సురక్ష సంహిత చట్టం) ప్రకారం కేసు నమోదు చేయడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ.... జిల్లా పరిధిలో ఉన్న పోలీసు అదికారులకు, సిబ్బందికి కొత్త చట్టాల పై అవగాహన కలిగి ఉండేందుకు విడతలవారీగా శిక్షణ కార్యక్రమం నిర్వహించడం జరిగిందన్నారు. జిల్లా లోని సిబ్బందికి, అధికారులకు ఓరియెంటెడ్ తరగతులు నిర్వహించి 100% సిబ్బందికి, అధికారులకు శిక్షణ ఇవ్వడం జరిగిందని అన్నారు. కొత్త చట్టాలను అనుసరించి కేసులు నమోదు చేయడం తో పాటు పకడ్బందీ గా అమలు చేయడం జరుగుతుందని అలాగే కొత్త చట్టాల ఎస్ఓపి నీ అనుసరించి విచారణ చేపట్టడం, సాక్ష్యాధారాలను సేకరించి న్యాయ స్థానాలలో చార్జ్ షీట్ వేయడం జరుగుతుందని అన్నారు.

ఈ మూడు కొత్త క్రిమినల్ చట్టాలలో సమకాలీన కాలం మరియు వాడుకలో ఉన్న సాంకేతికతలకు అనుగుణంగా అనేక కొత్త నిబంధనలు చేర్చడం జరిగిందని, బాధిత వ్యక్తుల హక్కులను పరిరక్షించడం, నేరాల విచారణను సమర్థవంతంగా నిర్వహించడానికి అనుగుణంగా కొత్త



క్రిమినల్ చట్టాలకు చాలా రూపొందించడం జరిగిందని అన్నారు. కొత్త చట్టాల వర్తింపు , నేరాలు , దానికి సంబంధించిన కేసులతో వ్యవహరిస్తున్నప్పుడు వాటిని ఎలా గ్రహించాలనే దానిపై అధికారులకు శిక్షణ ఇవ్వడం జరిగిందని అలాగే రైటర్స్ కు ఏలాంటి సందేహాలు ఉన్న జిల్లా నుండి శిక్షణకు వెళ్లి వచ్చిన ఎక్స్పర్ట్ ఉన్నతాధికారులను సంప్రదించి ముందుకెళ్లె విధంగా చర్యలు చేపట్టడం జరిగిందనీ జిల్లా ఎస్పీతెలిపారు.




## మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

**రాజేంద్రనగర్, జూలై2(నమస్తే ఉదయం):** మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని తెలంగాణ రాష్ట్ర మున్సిపల్ స్టాఫ్, అవుట్సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు కే రవీందర్ డిమాండ్ చేశారు. కార్మికుల సమస్యలపై ర్యాలీ నిర్వహించారు ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షులు కే రవీందర్ మాట్లాడుతూ... కార్మికులకు సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, పారిశుద్ధ్య విభాగంలో పనిచేస్తున్న కార్మికులకు పండుగ, జాతీయ సెలవులు అమలు చేయాలని, కార్మికులు నిర్వహిస్తున్న విధుల సమయంలో మరణిస్తే 25 లక్షల నష్టపరిహారం ఇవ్వాలని, మరణించిన కార్మికుని కుటుంబానికి దహన సంస్కారాల కోసం 30 వేల రూపాయలు ఇవ్వాలని, రాంకీ సంస్థలో పనిచేస్తున్న కార్మికులకు కనీస వేతనాలు ఈఎస్ఐ ఈపీఎఫ్ అమలు చేయాలని, ఇతర సమస్యలు పరిష్కరించాలని వినతి పత్రంలో పేర్కొన్నారు. వినతి పత్రం అందజేసిన వారిలో రాష్ట్ర అధ్యక్షులు కే రవీందర్ కార్యదర్శి బీజేపాల్ రెడ్డి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె ఏసురత్నం తదితరులు పాల్గొన్నారు

# బిజెపి ఓబీసీ మోర్చా అధికార ప్రతినిధిగా రాహుల్ గాజుల

**శంషాబాద్, జూలై 2 (నమస్తే ఉదయం):** భారతీయ జనతా పార్టీ ఓబిసి మోర్చా రంగారెడ్డి జిల్లా అధికార ప్రతినిధిగా శంషాబాద్ కు చెందిన రాహుల్ గాజులను నియమిస్తూ రంగారెడ్డి జిల్లా ఓబీసీ మోర్చా అధ్యక్షుడు దుద్దాల లక్ష్మీనారాయణ ప్రకటించారు. శంషాబాద్ పట్టణానికి చెందిన రాహుల్ గాజులను ఓబీసీ మోర్చా అధికార ప్రతినిధిగా నియమిస్తూ ఆయన ఉత్తర్వులు జారీ చేశారు. ఈ



నియామక పత్రం అందుకుంటున్న రాహుల్ గాజుల

సందర్భంగా రాహుల్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన వారికి కృతజ్ఞతలు తెలిపారు. నియామకానికి సహకరించిన బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డాక్టర్ ప్రేమ్ రాజ్ యాదవ్. బిజెపి జిల్లా ఉపాధ్యక్షుడు చింతల నందకిషోర్. శంషాబాద్ మున్సిపల్ బిజెపి అధ్యక్షుడు దేవేందర్ లకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. తనపై ఉంచిన విశ్వాసాన్ని వమ్ము చేయకుండా రాబోయే రోజుల్లో శంషాబాద్ లో బిజెపిని మరింత పటిష్టం చేయడానికి కృషి చేస్తానని రాహుల్ పేర్కొన్నారు. దేశానికి శ్రీరామరక్షగా ఉన్న ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నేతృత్వంలో ప్రజల సంక్షేమం కోసం ప్రవేశపెట్టిన పథకాలను అర్హులైన వారందరికీ అందే విధంగా చొరవ తీసుకుంటానని అన్నారు.

# పాఠశాలకు ఉపాధ్యాయులను కేటాయించండి

**- మాజీ సర్పంచ్ భీమ్ రెడ్డి**

**కొత్తకోట, జూలై 2(నమస్తే ఉదయం):** పాఠశాలకు బదిలీ అయిన ఉపాధ్యాయుల స్థానంలో తిరిగి కేటాయించండని కొత్తకోట మండలం రామకృష్ణాపురం గ్రామం మాజీ సర్పంచ్ మూలమల్ల భీమిరెడ్డి జిల్లా విద్యాశాఖ అధికారిని కోరారు. మంగళవారం గ్రామంలోని పాఠశాలలు సందర్శించి ఉపాధ్యాయుల బదిలీ అనంతరం విద్యార్థులు ఎదుర్కొంటున్న విషయాన్ని జిల్లా విద్యాశాఖ అధికారికి ఫోన్ ద్వారా సమాచారం అందించి వెంటనే ఉపాధ్యాయులను కేటాయించాలని కోరారు. గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు ఇటీవల జరిగిన ఉపాధ్యాయ బదిలీలలో పాఠశాల నుండి ముగ్గురు ఎస్ జి టి లు, ఒక హిందీ పండిట్ పాఠశాల నుండి బదిలీ అయ్యారు. బదిలీ అయిన ఉపాధ్యాయుల స్థానంలో విద్యాశాఖ అధికారులు పాఠశాలకు ఉపాధ్యాయులను కేటాయించకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారని ప్రస్తుతం ఉన్న ఒక ఉపాధ్యాయురాలు వివరించారు. అయితే గ్రామానికి బస్సు సౌకర్యం లేకపోవడం వల్ల ఉపాధ్యాయులు ఈ పాఠశాలలో పనిచేయటానికి మొగ్గుచూపటం జిల్లా విద్యాశాఖ అధికారులు వివరించారు.

విద్యార్థుల తల్లిదండ్రుల యొక్క విన్నపం మేరకు గ్రామ మాజీ సర్పంచ్ భీమ్ రెడ్డి ప్రస్తుతం



జిల్లా విద్యాశాఖ అధికారితో ఫోన్‌లో మాట్లాడుతున్న మాజీ సర్పంచ్ భీమ్ రెడ్డి

పని చేస్తున్న ఒక్క టీచర్ మాత్రమే స్కూల్లో ఉంది ఆమెతో అడిగి తెలుసుకుని మండల విద్యాశాఖ అధికారితో సమస్యపై ఫోన్లో సంభాషించారు. అందుకు విద్యాశాఖ అధికారులు స్పందించి పాఠశాలకు కావాల్సిన ఉపాధ్యాయులను పంపించడానికి చొరవ తీసుకుంటానని వివరించారని భీంరెడ్డి తెలిపారు. ఈ విషయాన్ని స్థానిక శాసనసభ్యులు జిఎంఆర్ కు పామాపురం వెళ్లే విద్యార్థులకు, అదేవిధంగా మహిళా టీచర్స్‌కి మా గ్రామాలు ఇబ్బందుల్లో ఉన్నాయని భీమ్ రెడ్డి వివరించారు. దేవరకద్ర శాసనసభ్యులు జి.మధుసూదన్ రెడ్డి సానుకూలంగా స్పందించి సంబంధిత అధికారులతో చర్చించి గ్రామానికి బస్సు సౌకర్యంతో పాటు ఉపాధ్యాయుల కేటాయింపు సమస్యను పరిష్కరిస్తానన్నారు.

# జగన్నాథ రథయాత్రకు వచ్చే భక్తుల కోసం తగిన ఏర్పాట్లు చేయాలి..

**- తోకల శ్రీనివాస్ రెడ్డి**

**రాజేంద్రనగర్,జులై 02 (నమస్తే ఉదయం):** మైలార్ దేవ్‌పల్లి డివిజన్‌లో ప్రతి ఏడాది నిర్వహించే పూరి జగన్నాథ్ రథయాత్ర ఉత్స వాలకు జిహెచ్ఎంసి అధికారులు తగిన ఏర్పాట్లు చేయాలని రాజేంద్రనగర్ నియోజకవర్గం కంటెస్టెడ్ ఎమ్మెల్యే, డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి అన్నారు. మంగళవారం డివిజన్ పరిధిలోనీ హౌసింగ్ బోర్డు, బృందావన్ కాలనీలలో ఆయా కాలనీల కమిటీ సభ్యులతో తోకల శ్రీనివాస్ రెడ్డి పర్యటించారు.



ఈ సందర్భంగా తోకల శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ...

వచ్చే ఆదివారం జరగబోయే పూరి "జగన్నాథ్ రథ యాత్ర"కు సంబంధించిన మౌలిక సదుపాయాలను కల్పించాలని అధికారులకు సూచించారు.జగన్నాథ రథయాత్రకు వచ్చే భక్తుల కోసం తగిన ఏర్పాట్లు చేయాలని సర్కిల్ అధికారులకు సూచించారు.

15 రోజుల పాటు పూరి జగన్నాథ్ యాత్ర అన్నదానాలు,ఉత్సవ కార్యక్రమాలు జరుగుతాయని శానిటేషన్ సిబ్బంది యాత్ర కొనసాగుతున్న రోడ్లపై ఉన్న చెత్తను తొలగించాలన్నారు.పూరి జగన్నాథ్ రథయాత్ర కొనసాగే మార్గంలో సీసీ రోడ్ల సమస్యలు పరిష్కరించాలన్నారు.రథ యాత్రకోసం సీసీ రోడ్డును పరిశుభ్రంగా ఉండేలా ప్రజలకు,భక్తులకు ఎలాంటి ఇబ్బందులూ తలెత్తకుండా అధికారులు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.ప్రజలకు ఇబ్బందులూ తలెత్తకుండా రాత్రి వేళల్లో స్ట్రీట్ లైట్ మరమ్మత్తు పనులు త్వరగా పూర్తి చేసి,నూతన స్ట్రీట్ లైట్స్ అమర్చాలన్నారు.ఈ కార్య క్రమంలో ఎఈ నరసింహ మూర్తి,వర్క్ ఇన్స్పెక్టర్ రాహుల్, మున్న సోరోజ్,గిరిధర్, శంకర్,ఎన్ను శ్రీనివాస్ రెడ్డి, అడికే శివ,మధుసూదన్ రెడ్డి,మాలతి,ప్రసాద్, సామేశ్,బస్తీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

# సమీకృత ప్రయోగశాలల భవన సముదాయాన్ని ప్రారంభించిన వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

**రాజేంద్రనగర్, జూలై2(నమస్తే ఉదయం) :** రాజేంద్రనగర్ లో నూతనంగా నిర్మించిన సమీకృత ప్రయోగశాలల భవన సముదాయంను మంగళవారం వ్యవసాయ శాఖా మాత్యులు తుమ్మల నాగేశ్వర రావు ప్రారంభించారు. ఈ సమీకృత భవనాలలో ఎరువుల నియంత్రణ ప్రయోగశాల, విత్తన పరిక్ష కేంద్రము, ప్రాంతీయ భుసార పరీక్షా కేంద్రాలు ఉన్నాయి. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ, ఇంతకుముందే పాత ప్రయోగశాలలు సందర్శించడం జరిగిందని రాష్ట్ర స్థాయిలో ఉన్న ప్రయోగశాలలు దుస్థితి ఈ విదంగా ఉంటే జిల్లాలో ఉన్న వాటి పరిస్థితి ఏ విదంగా ఉన్నాయో అంచనా వేయెచ్చని, ఈ ప్రభుత్వం అన్నిటిని ఒక్కక్కటిగా ఆధునీకరణ చేసుకుంటూ వాటి సేవలను మరింత ప్రభావ వంతంగా వినియోగించుకునేల చేస్తామని తెలియచేసారు. కొత్తగా అరంబించబడిన ఎరువుల నియంత్రణ ప్రయోగశాలలో సంవత్సరానికి 6000 నమూనాలు, విత్తనా పరిక్ష కేంద్రాములో 8000 నమూనాలు, భుసార పరిక్ష కేంద్రాములో 20,000 నమూనాలు పరిక్ష చేసే సామర్థ్యాలు ఉన్నాయని తెలియచేసారు. ఈ కార్యక్రములో స్థానిక ఎమ్మెల్యే టి. ప్రకాష్ గౌడ్ , వ్యవసాయ శాఖ ముఖ్య కార్యదర్శి రఘునందన్ రావు, వ్యవసాయ డైరెక్టర్ బి.గోపి , ఉద్యాన శాఖ డైరెక్టర్ యాస్మిన్ , కో ఆపరేటివ్ డైరెక్టర్ ఉదయ కుమార్ , రంగారెడ్డి జిల్లా కల్లెక్టర్ కె. శశాంక, వ్యవసాయ విశ్వవిద్యాలయ పరిశోధన సంచాలకులు డాక్టర్ పి. రఘు రామి రెడ్డి, రాజేంద్ర నగర్ కార్పోరేటర్ పి.ఆర్చన, వ్యవసాయ శాఖ అదనపు




ఇంటిగ్రేటెడ్ లేబొరేటరీ కాంప్లెక్స్‌ను ప్రారంభిస్తున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్‌లు

సంచాలకులు విజయ్ కుమార్ వ్యవసాయ శాఖ ఆధికారులు ఎస్ మహిత, వి.వెంకటేశ్వర్లు, నిర్మల లు పాల్గొన్నారు.



పాఠశాలలో మధ్యాహ్న భోజనం వంటకాలను పరిశీలిస్తున్న జడ్పీ చైర్మన్ సరిత , పాఠశాల ఆవరణలో మొక్కలు నాటుతున్న జడ్పి చైర్మన్ సరిత , కార్యక్రమంలో మాట్లాడుతున్న జడ్పీ చైర్మన్ సరిత

# విద్యార్థులకు నాణ్యమైన విద్య, మెనూ ప్రకారం భోజనం అందించాలి

**గద్వాల జిల్లా ప్రతినిధి, జూలై 2(నమస్తే ఉదయం)** కేజీబీవీ పాఠశాలలో విద్యార్థులకు నాణ్యమైన భోజనాలు సరియైన సమయానికి మెనూ ప్రకారం అందించాలని గద్వాల జిల్లా జెడ్ పి చైర్ పర్సన్ సరిత అధికారులకు సూచించారు.

మంగళవారం గద్వాల మండలం గోనుపాడు గ్రామంలో ఉన్న కస్తూర్బా గాంధీ పాఠశాలను జెడ్పి చైర్ పర్సన్ ఆకస్మిక తనిఖీ చేసారు. పాఠశాల ఆవరణలో కలియతిరిగి విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. క్లాస్ రూములను పరిశీలించి విద్యార్థులకి విద్యాబోధన ఏ విధంగా అందుతుందో పర్యవేక్షించారు.

వర్షాకాలం సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. అనంతరం ఎన్.సి.సి విద్యార్థులతో కలసి పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. పాఠశాలలో నెలకొన్న అదనపు గదులు సమస్యలను, ట్రాన్స్‌ఫర్ ఏర్పాటు చేయాలని ఆమె దృష్టికి కస్తూర్బా గాంధీ ఉపాధ్యాయులు తీసుకొచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు మధుసూదన్ బాబు,గోనుపాడు శ్రీనివాస్ గౌడ్, అమరావాయి కృష్ణారెడ్డి,శెట్టి ఆత్మకూరు లక్ష్మణ్, నాగేంద్ర యాదవ్, లత్తిపురం వెంకట్రామిరెడ్డి,తుమ్మల నర్సింహులు, డిటిడిసి నర్సింహులు, జమ్మిచేడు ఆనంద్,భాస్కర్ యాదవ్,మల శ్రీని వాసులు, టి ఎన్ ఆర్ జగదీష్, రాఘవేంద్ర రెడ్డి, అనంతపురం రాముడు,ఆంజనేయులు, దడవాయి నర్సింహులు, రాఘురామి రెడ్డి, షాష,బంగి నవీన్,రామాంజనేయులు,పాఠశాల ఎస్ఓ శ్రీదేవి, ఉపాధ్యాయులు తదితరులు ఉన్నారు.

# బస్సులు లేక విద్యార్థుల అవస్థలు

**గద్వాల జిల్లా ప్రతినిధి, జూలై 2(నమస్తే ఉదయం)** పాఠశాలలకు,కళాశాలలకు వెళ్ళే విద్యార్థులకు ఆర్టీసి బస్సులు లేక అవస్థలు పడుతున్నారు. కొందరు విద్యార్థుల కిల్లో మీటర్ ల మేర కాలినడకన నడుచుకుంటు పాఠశాలలకు వెళ్తుంటారు. ధరూర్ మండల కేంద్రంలో గల జెడ్పీహెచ్ఎస్, ప్రభుత్వ జూనియర్ కళాశాలలకు కొండాపురం, మైలగడ్డ, అల్వాల్ పాడు, కోతుల గిద్ద, కొత్తపాలెం, జాంపల్లి గ్రామాల నుంచి వందాలది మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. రాయచూరు నుంచి గద్వాలకు వెళ్లే మార్గంలో ధరూర్ మండల కేంద్రానికి పాఠశాల, కళాశాల సమయాల్లో తగినన్ని ఆర్టీసి బస్సులు లేకపోవడంతో ప్రమాదమని తెలిసినా విద్యార్థులు బస్సులకు వేలాడుతూ ప్రయాణం సాగిస్తున్నారు.

రాయచూరు గద్వాల కు రాకపోకలు సాగించు ఆర్టీసి బస్సులు ఉదయం,సాయంత్రం వేళ్లలో తగ్గినని బస్సులు లేకపోవడంతో ఉన్న బస్సుల కు ప్రయాణికుల రద్దీతో విద్యార్థులు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. గతంలో మాదిరిగా కాకుండా, ఆర్టీసీ అధికారులు ట్రిప్పులను తగ్గించారు. దీంతో ఒక్కో బస్సులో 200 మంది వరకూ ప్రయాణించాల్సిన పరిస్థితి ఏర్పడింది. పాఠశాలకు, కళాశాలకు సరైన సమయంలో వెళ్లేందుకు




రద్దీతో వెళ్తున్న ఆర్టీసీ బస్సు , బస్సు లేకపోవడంతో కాలినడకతో వెళ్తున్న విద్యార్థునులు

విద్యార్థులు బస్సు కిటికీలు, డోరు వద్ద వేలాడుతూ ప్రయాణం చేస్తున్నారు.

బస్సు సర్వీసులు పెంచాలని గతంలో పలుమార్లు అధికారులకు విన్నవించినా ఫలితం లేదు. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు ఈ మార్గాల్లో బస్సు సర్వీసులను పెంచాలని విద్యార్థులు, ప్రయాణికులు కోరుతున్నారు.oo




కార్యక్రమంలో ప్రసంగిస్తున్న ఎంపీడీవో, పదవీకాలం ముగిసిన ప్రజాప్రతినిధులను సన్మానించిన అధికారులు

# మండల పాలకవర్గానికి వీడ్కోలు

**గద్వాల(కేటిదొడ్డి)జూలై2(నమస్తే ఉదయం):** మండల పాలకవర్గమైన ఎంపీపీ జడ్పిటిసి ఎంపిటిసి లను ఎంపీడీవో రాములునాయక్, ఎంపీఓ సయ్యద్ ఖాన్ , వివిధ శాఖల అధికారులు ఘనంగా సన్మానించారు. మంగళవారం మండల కేంద్రంలోని రైతు వేధికలో మండల పాలకవర్గ వీడ్కోలు సమా వేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ... ఎంపీపీ, జడ్పిటిసి,ఎంపీటీసీల పదవీకాలం ఈనెల 4న ముగియ ఉండడంతో, వీరందరికీ మండల వివిధ శాఖల అధికారులచే ఘనంగా సన్మానం చేసి వీడ్కోలు పలికామన్నారు. గత ఐదు సంవత్సరాలుగా ఎంపీపీ మనోరమ్మ, జడ్పిటిసి రాజశేఖర్, వైస్ ఎంపీపీ రామకృష్ణనాయుడు, ఎంపీటీసీలు ప్రభుత్వ అధికారులకు సహకరించి ప్రజా సంక్షేమం కొరకు, గ్రామాల అభివృద్ధి కొరకు తోడ్పాటు అందించినందుకు వారికి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో ఎంఇఓ సురేష్, వివిధ గ్రామాల ఎంపీటీసీలు, అధికారులు పాల్గొన్నారు.


**Printed and Published M. DAMODAR REDDY** on behalf of DBC Publications, and Printed at Vanitha Graphics, HNO:6-2-4/1,Shivaram pally ,Rajendranager, Ranga Reddy Dist, Telangana State -500048. and Published at: H.No. 6-2-4/2, 1st Floor, Shivarampally, NPA, Rajendra Nagar, Ranga Reddy Telangana-500052. **Editor: M.VANITHA REDDY. "RNI. Title- Code: TEL TEL 12232**. Cell: 89779 39135.